క్లుప్తంగా

నేడు శివరామ బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

పామూరు: అనుమునిగిరి శివరామ బ్రహ్మేంద్ర స్వామి క్షేత్రంలో శ్రీ శివరామ బ్రహ్మేంద్రస్వామివారి 130 వ ఆరాధన మహోత్సవం మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శివరామ దీక్షితులు తెలిపారు. ఈసందర్భంగా ఉదయం 7 గంటలకు సుప్రభాతసేవతో ప్రారంభమై అనంతరం ప్రణవవేద పారాయణం, యోగదండ స్వానారంబం, కలశతీర్థం, స్వామికి రుద్రాభిషేకం, ధ్వజారోహణం, కుంకుమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, రాత్రి 8 గంటలకు అన్నదానం అనంతరం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక క్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ ఉష, అధికారులు

పీసీపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరాలకు మంచి ఆరోగ్యం ఇవ్వాలని తహసీల్దార్ ఉష అన్నారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎమ్మార్వోలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హనుమంతరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల మంచి ఆరోగ్యకరమైన గాలి వస్తుందన్నారు. ఎంఈఓలు ఆర్ శ్రీనివాసాచారి, సంజీవ్, సుబ్బరామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

17 నుంచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు

టంగుటూరు: మండలస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీలు ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓలు చెల్లి ఆనందరావు, బాలాజీలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ పోటీలతో పిల్లలో పోటీతత్వం, మానసిక వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ ఎస్ అరుణ, టి.అశోక్‌బాబు, రాజ్యలక్ష్మి, పి.వెంకట్రావు, చిరంజీవి, మోహన్‌రావు, ప్రశాంతి, కౌశల్య, శ్రీవిద్య, సుప్రజ పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వసించనున్నట్లు పీడీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17 ఏళ్ల లోపు విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

రోగులు, అనాథలకు అన్నదానం

కనిగిరిరూరల్: స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగుల, అనాథల ఆకలి తీర్చుతున్నారు. ఈమేరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు, అనాథలకు, పేదలకు సోమవారం అన్నదానం చేశారు. అనంతరం ట్రస్ట్ కన్వీనర్ డి.సుధీర్ బాబు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్నేహహస్తం ట్రస్ట్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది అక్బర్‌వలి, గౌస్, మోహన్‌కుమార్, ఖాశింపీరా తదితరులు పాల్గొన్నారు.

రెండు హెక్టార్లు మాత్రమే నర్సరీ వేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

కొండపి: ఒక రైతు గరిష్టంగా రెండు హెక్టార్లు మాత్రమే నర్సరీ వేయాలని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని తాటాకులపాలెంలో కమర్షియల్ పొగాకు నర్సరీలను సాగుచేసే రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారుమడి పెట్టి ప్రతి రైతు బోర్డు వద్దకు వచ్చి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నారుమడులు పెట్టిన రైతులపై చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.36 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,36,288 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు, వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణలు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.70,810, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,570, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.51,876, మహాప్రాకార నిర్మాణానికి రూ.85,516, పంచామృతాభిషేకానికి రూ.5,516 వచ్చినట్లు ఈఓ తెలిపారు. విజయవాడకు చెందిన పరుచూరి వాసుదేవరావు గాయత్రి రూ.50,516, సీఎస్‌పురంకు చెందిన యేల్చూరి వెంకటసుబ్బయ్య, సుబ్బలక్ష్మమ్మలు రూ.35 వేలు విరాళంగా ఇచ్చారన్నారు.

తాగునీటికి తప్పని తంటా



తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ ఆవులవారిపల్లిలో మూలనపడిన ట్యాంక్



వాలిచర్లలో నిరుపయోగంగా ఉన్న సంప్

- మరమ్మతులకు నోచుకోని సాగర్ జలాల పంపింగ్ మోటార్లు
- నిరుపయోగంగా సంపులు, ఓహెచ్ ట్యాంకులు
- ఆవులవారిపల్లికి అందని సాగర్ జలాలు
- మోటార్ల మరమ్మతులు పట్టించుకోని పాలకులు, అధికారులు



వాలిచర్లలో మూలనపడిన పంపింగ్ మోటార్లు



వాలచర్లలో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

హనుమంతునిపాడు:

మండలంలోని పలు గ్రామాల్లో సాగర్ జలాలు అందక తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చందవరం ప్రాజెక్టు నుంచి మండలానికి సరఫరా అయ్యే నీరు సక్రమంగా అందడం లేదు. ముఖ్యంగా కొండ శివారు గ్రామాలకు నీరు అందక తాగునీటికి తిప్పలు తప్పడం లేదంటున్నారు.

మండలంలోని గ్రామ పంచాయతీల్లో 20 వరకు ఓవర్ హెడ్ ట్యాంకులు, మినీ ట్యాంకులు ఉన్నాయి. నీరు పైప్‌లైన్ల ద్వారా కొండ శివారు గ్రామాలకు నీటిని పంపింగ్ చేసి ఎక్కించేందుకు కూటాగండ్ల, వాలిచర్ల, నందవనం, హాజీపురం అడ్డరోడ్డులో మోటార్లు, సంపులు, ట్యాంకులు ఏర్పాటు ఏశారు. అయితే వాలిచర్ల, నందనవనం వద్ద సంపు మోటార్లు మరమ్మతులు నోచుకోక మూలనపడ్డాయి. అయినా మరమ్మతులు చేయలేదు. చందవరం ప్రాజెక్టు నుంచి వచ్చే సాగర్ జలాలు హాజీపురం, హనుమంతునిపాడు దాటి పై గ్రామాలకు చుక్క నీరు సరఫరా కావడం లేదు. దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి, హాజీపురం అడ్డరోడ్డు వరకు పైపులైన్లు లీకులమయంగా మారాయి. వాటి గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

కాలిపోయిన మోటార్లు..

వాలిచర్ల, నందనవనం వద్ద మోటార్లు కాలిపోయి రెండేళ్లు దాటింది. అయినా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో కూటాగుండ్ల, దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు, రామాయిపల్లి, కిష్టంపల్లి, మాసాయిపేట, ఈదరవారిపల్లి, మిట్టపాలెం, విరగారెడ్డిపల్లి వరకు సాగర్ జలాల సరఫరా నిలిచిపోయింది. బోర్ల నుంచి వచ్చే ఫ్లోరైడ్ నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. నందిరెడ్డిపల్లి, అప్పలరెడ్డిపల్లి, గురవారెడ్డిపల్లి గ్రామాలకు సాగర్ జలాలు అందడం లేదు. ఈ గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నందనవనం వద్ద మోటార్ల మరమ్మతులతో నందనవనం సంపు నుంచి వీరరాంపురం, నందవనం, పాపిరెడ్డిపల్లి, గమ్ములపాలెం, అగ్రహారం, ఉమ్మనపల్లి, తాళ్లవారిపల్లి, మంగంపల్లి గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లోని డీప్‌బోర్లు, తాగునీటి పథకాలు, చేతి పంపులు మరమ్మతులు చేయక మూలనపడ్డాయి. వాటి మరమ్మతుల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గానీ, పాలకులు గాని పట్టించుకోవడం లేదు. తాగునీటిని సైతం రూ.20 చొప్పున బబుల్ కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిగా రాని సాగర్ జలాలు

ఏడాది కాలం నుంచి వీరరాంపురం గ్రామంలోని ఎస్సీ కాలనీకి సాగర్ తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో నుంచి సాగర్ జలాలు పైపులైన్ ఉంది. కానీ ఎస్సీ కాలనీకి చుక్క నీరు అందించడం లేదు. దీంతో వాడుక, తాగునీటికి అవస్థలు పడుతున్నామని వీరరారంపురం ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



మాదక ద్రవ్యాల నియంత్రణ ఆవశ్యకతపై వివరిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశలో ఇష్టంతో కష్టపడి చదవితే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక అనిల్ గార్డెన్స్‌లో సోమవారం ఎస్‌వీ జూనియర్ కళాశాల, ఇటీఎస్‌అండ్‌ఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం కళాశాలల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమానాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి, అధ్యాపకుల అండదండలతో ఉన్నత విద్యవైపు సాగాలన్నారు. ఎక్కడైనా మద్యం, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేవీఎస్ఎస్ ప్రసాద్‌కుమార్, కేసీహెచ్.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవాస యోజన పథకంపై అవగాహన కల్పించాలి



అంగీకార్ పథకం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కనిగిరిరూరల్: ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం 2.0 అంగీకార్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మవారం అంగీకార్ 2025 పథకం బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి అంగీకార్ పథకం ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ గృహ నిర్మాణం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా తెలిపారు. అంగీకార్ 2025 ప్రచారం ద్వార పీఎంఏవై అర్బన్ 2.0 పథకం ప్రయోజనాల గురించి, ప్రధానమంత్రి సూర్యఘర్ గురించి సదస్సులు, మేళాలు, అవగాహన కార్యక్రమాలు కల్పించి, అర్హత కల్గిన ప్రతి ఒక్కరు సోలార్ ఏర్పాటు చేసుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చే స్తున్నట్లు వివరించారు. మేనేజర్ ఇనుపగుర్ల ప్రసాద్, టీపీఓ సువర్ణకుమార్, ఏఈ అశోక్, సీఎల్ టీసీ ఎస్‌కే అర్షద్, ప్లానింగ్ సెక్రటరీ కృష్ణా పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

కనిగిరిరూరల్: అర్హులందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్ ఏపీ రవిశంకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్ మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో కూటమి సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలాలను అర్హులకు ఇస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా కనీసం ఒక్కరికి కూడా ఇంటి స్థలం మంజూరు చేయలేదని ఘాటుగా విమర్శించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందచేశారు. ఎస్‌కే ఖాశిం పీరా, గుజ్జుల బాలిరెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు ఎస్‌కే బషీరా, రంజా బేగం, సల్మా, హబీబా, రిహానా, పిచ్చమ్మ, హజరత్‌బీ, హబీబా పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలు ఆరోగ్యానికి మేలు

టంగుటూరు: సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంఈఓ ఆనందరావు అన్నారు. కందులూరు లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలను హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో ఎంఈఓ ఆనందరావు చేతుల మీదుగా అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ఆకుకూరలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. మన్నం వెంకయ్య, హెడ్మాస్టర్ లక్ష్మీకుమారి, శ్రీహరి, శ్రీనివాసరావు, సుజాత, హరిత పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 11వ వార్డు కాశీపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. శిబిరానికి వచ్చి బాధితులకు మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి ఫణికుమార్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

స్థానిక గార్లపేట రోడ్డులో మోడల్ స్కూల్ వద్ద గల జగనన్న లేవుల్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ వినతిపత్రం అందచేశారు. జగనన్న లేఅవుల్ కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లలో అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలన్నారు. జగనన్న కాలనీలోని నివాసితులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ తెలిపారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

టంగుటూరు: ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి డివైడర్ ఎక్కిన లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయపడిన లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..గుంటూరు నుంచి గూడూరుకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ..తూర్పునాయుడుపాలెం వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీని తప్పించబోయి డివైడర్ ఎక్కింది. ఈ సమయంలో మరో లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ చింతల భాస్కర్(37) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. జాతీయ రహదారి సిబ్బంది, ఫైర్ సిబ్బంది సాయంతో డ్రైవర్ చింతల భాస్కర్‌ను బయటకు తీసి జాతీయ రహదారి అంబులెన్సులో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగ మల్లీశ్వరరావు తెలిపారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన



ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

హనుమంతునిపాడు: పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. అనంతరం ఎంపీడీఓ ఎంరంగసుబ్బరాయుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఏళ్ల తరబడి జీతాలు ఇవ్వకుంటే వారు బతకాలని ప్రశ్నించారు. వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందచేస్తున్న వికలాంగుల హక్కుల వేదిక నాయకులు

కనిగిరిరూరల్: ర్దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల వేదిక నాయకులు మాట్లాడుతూ రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు పర్సంటేజీల్లో కోత విధిస్తూ అర్హులైన వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. పుట్టకతో పోలియో వచ్చిన వారికి జీవితాంతం వైకల్యం ఉంటుందని. వైకల్యం మార్పు లేనప్పుడు వైకల్య శాతంలో మాత్రం మార్పు ఎలా వస్తోందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు డాక్టర్‌లకు సదరం గురించి కనీస కౌన్సెలింగ్, అవగాహన కల్పించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. డాక్టర్ల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓకు అందచేశారు. వేగినాటి వెంకట సుబ్బారెడ్డి, వేముల మైనర్ బాబు, శ్రీరామలక్ష్మీ, వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నిరసన



కనిగిరిరూరల్: నిరసనలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేతలు



టంగుటూరులో ఏపీటీఎఫ్ నేతల నిరసన

కనిగిరిరూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. అనంతరం ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాయబ్ రసూల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్ , డీఏ బకాయిలను, 4డీఏలను తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని, మెమో 57ను తక్షణ అమలు చేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిటీల నియామకం చేయాలని, ఉపాధ్యాయులకు రావాల్సి అరియర్స్ చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగుల లీవ్ ఎన్క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలని, అనవసర యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేసి ఉపాధ్యాయులకు బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, జోన్ నాయకులు రాజ్‌కుమార్, కె.రామ్మోహన్‌రావు, మేకల శ్రీనివాసులు, మచ్చప్రసాద్, జీఎస్ ఆనంద్‌బాబు, పి.మాలకొండయ్య, కేవీ సుబ్బయ్య, ఎస్ రమేష్‌బాబు, పెన్నా వెంకటేశ్వర్లు, కె.రామసుబ్బారావు, జి.మల్లికార్జునరాజు, నాగమణి, ఎలిజిబెత్, సౌజన్య, మహేశ్వరి, సుభాషిణి, సీహెచ్ సునీత, డి.పున్నమ్మ, అరుణ, గాలి రవీంద్ర, ఎన్ గాంధీ, కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి విజయసారధి, రాష్ట్ర కౌన్సిలర్ కాట్రగడ్డ రవి, టంగుటూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రబాబు, వెంకటరావు, జరుగుమల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, బ్రహ్మయ్య, సింగరాయకొండ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సుధాకరరెడ్డి, కొండపి సభ్యులు కోటేశ్వరరావు, శ్రీమన్నారాయణ, కొంగర శ్రీను, కృష్ణ, పద్మ, యశోధర, అరుణ, అన్నపూర్ణ , వాసు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చౌటపాలెంలో పశు వైద్య శిబిరం



పొన్నలూరు : చౌటపాలెంలో గేదెలకు వైద్యం చేస్తున్న డాక్టర్ శివరామకృష్ణ

పొన్నలూరు: మండలంలోని చౌటపాలెం, పొన్నలూరు గ్రామాల్లో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి శివరామకృష్ణ గేదెలకు, గొర్రెలు, మేకలకు సాధారణ వైద్య పరీక్షలు, గర్భ కోశ వ్యాధుల నిర్ధారణ, చూడి పరీక్షలు, గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాపించారు. అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వచ్చే నెల 15 వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు ద్వారా గేదెలు, గొర్రెలు, మేకలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. సీజనల్ వ్యాధులు, గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మర్రిపూడి: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పశువైద్యాధికారి మంచికల మణిశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పశు వైద్యశాలలో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు నీరసించడం, నోటవెంట తీగల మాదిరి సొంగ కారడం, తీవ్రమైన జ్వరం, కాలికి పుండ్లు ఏర్పడటం లాంటి లక్షణాలు ఉంటే గాలికుంటు వ్యాధిగా నిర్ధారించుకోవచ్చు అన్నారు. ఈ వ్యాధి ఉన్న సూడి గేదెలు ఈసుకుపోయో అవకాశం ఉందన్నారు. పాల ఉత్పత్తి సైతం తగ్గుతుందన్నారు.

వేలంలో రూ.36.28 లక్షల ఆదాయం

- గ్రామస్తుల సిండికేట్‌తో తగ్గిన రూ.3.82 లక్షల ఆదాయం
- పొగాకు ధరలు సాకు చూపి ఎకరాకు రూ.12 వేలకు మించని కౌలు ధర



భూముల వేలంలో వాదులాడుకుంటున్న గ్రామస్తులు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం దావగూడూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ భూముల కౌలువేలం జరిగింది. మొత్తం 295.46 ఎకరాల భూమికి వేలంపాట నిర్వహించగా రూ.36.28 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ సాంబశివరావు తెలిపారు. గత ఏడాది వేలంద్వారా రూ.40.10 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.3.82 లక్షల ఆదాయం తగ్గిందన్నారు. స్వల్ప ఘర్షణల నడుమ వేలం పాటలు సజావుగా ముగిసాయి. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, ఈఓలు డి.వరదారెడ్డి, ఎం శ్రీనివాసరావు, కేవీ సుబ్రమణ్యం, కె.వెంకటరెడ్డి, సిబ్బంది సీహెచ్ రామలింగారెడ్డి, డి.శ్రీనివాసులు, ఏ కోటిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామస్తుల సిండికేట్..

ఈ సంవత్సరం పొగాకు ధరలు పడిపోయి ఆర్థికంగా నష్టపోయామన్న సాకు చూపి గ్రామస్తులందరూ సిండికేట్ అయి భూముల వేలం ఎకరాకు రూ.12 వేలకు మించి పెరగకుండా జాగ్రత్త పడ్డారు. ఆ ప్రకారం వేలం పాటల ద్వారా భూములు దక్కించుకున్నారు. ఆ గ్రామానికి చెందిన నార్నే పద్మావతి సిండికేట్‌కు విరుద్ధంగా 8.56 ఎకరాల భూములకు పోటీ రావటంతో దేవస్థానానికి రూ.1.96 లక్షల ఆదాయం వచ్చిందని దేవస్థాన వర్గాలు వివరించారు.

పరిమితి మించితే జరిమానా



టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

టంగుటూరు: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే జరిమానా విధిస్తామని సీఐ హజరత్తయ్య హెచ్చరించారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద ఆటోడ్రైవర్లు, ప్రయాణికులకు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతో ఆటోడ్రైవర్లు ఓవర్ లోడుతో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. విధిగా లైసెన్సులు, ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు. అనంతరం 70 మందికి జరిమానా విధించారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన



మాట్లాడుతున్న సీహెచ్ హరికృష్ణ

కనిగిరిరూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ పిలుపు మేరకు సోమవారం విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ సీహెచ్ హరికృష్ణా మాట్లాడుతూ ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, గ్రేడ్-2 జేఎల్ఎం లను క్రమబద్ధీకరించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే అమలు చేయాలని, దళారీ వ్యవస్థను రద్దు చేసి, కార్మికులకు నేరుగా వేతనాలు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాల్గు డీఏ బకాయిలను చెల్లించాలని, క్షేత్ర స్థాయిలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. యూనియన్ నాయకులు జి.రమేష్, ఎస్ సుభాష్, కృష్ణా, కుమార్, హుస్సేన్, బాషా, జీసీహెచ్ అనంతయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

పొగాకు కనిష్ట ధర రూ.109

కొండపి: క్లస్టర్ పరిధిలోని అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్ద కండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 1067 బేళ్లను తీసుకురాగా 788 బేళ్లను కొనుగోలు చేసి 279 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.331, కనిష్ట ధర రూ.109, సరాసరి ధర రూ.211.72గా నమోదైంది.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో 241 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కె. ఉప్పలపాడు గ్రామాలకి చేందిన రైతులు 971 బేళ్లను వేలానికి తీసుకురాగా 730 బేళ్లను కొనుగోలు చేసి 241 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.331, కనిష్ట ధర రూ.120, సరాసరి ధర రూ.274.85 పలికింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కనిగిరిరూరల్: రోడ్డు దాటుతున్న మోటార్ బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న మరో మోటార్ బైక్ ఢీకొన్న ఘటనలో సోమవారం రాత్రి ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని చల్లగిరిగిల్లకు చెందిన మిట్టా వెంకటేశ్వర్లు(42) ఎస్సీ కాలనీ వైపు నుంచి ప్రధాన గ్రామంలోకి వెళ్లేందుకు బైక్‌పై రోడ్డును దాటుతుండగా కనిగిరి వైపు నుంచి అతివేగంగా నందనమారెళ్ల వైపు వెళ్తున్న బైక్ రోడ్డు దాటుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మిట్టా వెంకటేశ్వర్లు తలపగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. కోమటిగుంట్ల బాల చెన్నయ్యకు స్వల్ప గాయలయ్యాయి. మరొకరికి కూడా గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై టి.శ్రీరాం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.